
# ఈ ప్రశ్నకు బదులేది?

ప్రతాప రవిశంకర్

రోడ్డు పక్కనే వున్న పొలానికి కంచెగా వేసిన తుమ్మ చెట్ల ముందు నిలబడింది జీవరత్నం. జీవరత్నం అక్కడకు వచ్చి ఓ పావుతక్కువ గంట కావస్తోంది. ఆమెకు ఇంకో ఆరు నెలలు గడిస్తే ఇరవై యేళ్ళు నిండుతాయి. ఆమె పక్కనే కొంచెం చదునుగా వున్న నేలమీద ఓ ప్లాస్టిక్ డబ్బా నిండా నీళ్లున్నాయి.



బొగ్గుతో నడిచే రైలింజను లాంటి వంటి రంగుతో జిడ్డు కారుతున్న మొహంతో నిలుచుని రోడ్డుకు రెండువైపులా ఆశగా దిక్కులు చూస్తూ వున్నది.

కూర్చోవటం, వెంటనే నిలుచోవటమే సరిపోయింది వచ్చిన దగ్గర్నించీ. ఇంతకీ వచ్చిన పని కాలేదు.


ఓ ఆరునెల్ల క్రితం జీవరత్నం ఓ పాపకు జన్మనిచ్చింది. అక్కడ నిల్చున్నదేగానీ ఉయ్యాలలో వున్న పాప గురించిన ఆలోచన – పూర్తికాని పని గురించిన ఆందోళనతో ఆమెకు బాగా అసహనంగా వుంది.

ఇలా ఎన్నాళ్ళు?

ఆలోచిస్తోంది జీవరత్నం.

బాగా ట్రాఫిక్ వున్న రోడ్డు. దాదాపుగా అక్కడితో ఆ వూరు అంతమవుతుంది. ఇక అక్కడి నుంచీ అన్నీ పొలాలు. కొంచెం దగ్గరలో లిఫ్ట్ ఇరిగేషన్ తాలూకు పెద్దపెద్ద నీటి గొట్టాలతో ఓ పక్కా భవనం. దానిపక్కగా ఓ వెడల్పాటి వాగు. ఆ వాగులో కొంతమంది పిల్లలు పశువులను కడుగుతున్నారు.

వాళ్ల వల్ల అంతగా ఇబ్బంది లేదు. వాళ్లకీ జీవరత్నానికీ మధ్య అడ్డుగా రెండు పెద్ద చింతచెట్లు వున్నాయి. ఉన్న సమస్య అంతా రోడ్డుమీద తక్కువ విరామంతో వెళుతున్న మోటారు వాహనాల గురించే.




ఆ ఊరు దాటితే రెండు కిలోమీటర్ల దూరంలో టౌను వుంది. అక్కడికి ఓ ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న ఇంకో టౌనుకు లెక్కలేనన్ని ఆటోలూ, జీపులూ, బస్సులూ –

పది నిముషాల్లో పని ముగించుకుని తిరిగి వెళ్లవచ్చునని అనుకుని పసిపాపకు పాలు కూడా పట్టకుండా గుడిసెలో వెదురు బొంగుకు వేసిన తన చీర ఉయ్యాలలో పాపను వుంచి ప్లాస్టిక్ డబ్బాతో నీళ్లు ముంచుకుని ఆ తుమ్మచెట్ల దగ్గరకు వచ్చింది. ఇంట్లో జీవరత్నం పెనిమిటి కేయాస్ కూడా లేడు. పొద్దుటే రిక్షా తొక్కడానికి టౌనుకు వెళ్లాడు.

రోడ్డు మీద జనసంచారం లేనందున జీవరత్నం చటుక్కున కూర్చుంది. ఇంతలో రోడ్డు మలుపు తిరిగి ఓ ప్రయాణీకుల జీపు దూసుకుని వచ్చింది.

షాక్ తిన్నదానిలా మళ్లీ నిల్చుంది ఆమె.

జీపునిండా వున్నారు జనం. కొంతమంది జీపు పైన కూడా కూర్చున్నారు. జనంలో ముంచి తీసినట్టు వుంది జీపు. వెనుకవైపు కూడా మనుషులు వేల్లాడుతున్నారు.

ఆ జనంలో వున్న ఒకరిద్దరు మగాళ్లు జీవరత్నం గబుక్కున నిలబడడం చూసి 'కూసో... కూసో...' అన్నారు హేళనగా నవ్వుతూ...

కోపం వచ్చింది జీవరత్నానికి. అయినా ఏమీ చెయ్యలేక ప్లాస్టిక్ డబ్బాలో వున్న నీళ్లను అక్కడే వొంపేసి ఇంటికి తిరిగి వెళ్లాలని అనుకున్నది. అయినా నిగ్రహించుకుని అక్కడే నిల్చున్నది. అలా చేస్తే ఇంటికి వెళ్లి మళ్లీవచ్చి ఇంకో గంట అక్కడ నిలబడాలి.

ఇలా అనుకుని అక్కడే నిలబడింది. ఒక ఐదు నిమిషాలపాటు అటువైపు జీపులూ, బస్సులూ రాలేదు. ఇక కూర్చోవచ్చు అనుకునే సమయానికి ఊళ్లోనుంచి ఇద్దరు మనుషులతో పెద్ద శబ్దంతో వేగంగా వచ్చిన స్కూటరు జీవరత్నం ముందుకు వచ్చి ఆగిపోయింది. వాళ్లు దాన్ని కదిలించే ప్రయత్నం చేస్తూ ఓ పది నిముషాలు అక్కడే వున్నారు. చివరకు విసిగిపోయి దాన్ని నెట్టుకుంటూ వూళ్లోకి బయల్దేరారు. వాళ్లు అక్కడినుంచి కదలగానే తిరిగి కూర్చుందామనుకుంది జీవరత్నం. కానీ ఆ ఇద్దర్లో స్కూటరు మీద వెనక కూర్చున్నవాడు నడుస్తూనే మాటిమాటికీ వెనక్కి తిరిగి చూడటం మొదలు పెట్టాడు.

అందుకే జీవరత్నం కూర్చోకుండా దిక్కులు చూస్తూ నిలబడి వుంది. అప్పుడు రెండు ఆటోరిక్షాలు పోటీపడుతూ వేగంగా దూసుకుని వెళ్లాయి.

అవకాశం వచ్చిందని జీవరత్నానికి అనిపించగానే వాగులో కడిగిన పశువులను తోలుకుంటూ ముగ్గురు పిల్లలు అటుగా వచ్చారు. పశువుల మీద తడి ఆరలేదు. అవి చిన్నగా నడుస్తూ జీవరత్నం ముందు నుంచి వెళ్లాయి. ఆ పిల్లలు ముగ్గురూ రిలాక్సింగ్‌గా బీడీలు కాలుస్తూ భావరహితంగా జీవరత్నాన్ని చూస్తూ వెళ్లిపోయారు.

ఉన్నట్టుండి ఏదో గుర్తుకు వచ్చినట్టు పక్కనే వున్న ప్లాస్టిక్ డబ్బాలో నీటిని చూసుకుంది జీవరత్నం. ఆ డబ్బాకు ఎక్కడైనా చిన్న చిల్లి వుంటే నీళ్లు కారిపోయి వుంటాయి. ఇంతకీ ఆ డబ్బా జీవరత్నానిది కాదు. పక్క గుడిసెలో వుండే నాగరత్నాన్ని అడిగి తీసుకువచ్చింది. నీళ్లు అలాగే వున్నాయి.

ఉయలలో పసిపాప గుర్తుకు రాగానే జీవరత్నంలో ఆత్రుత పెరిగిపోయింది. రోడ్డు రెండువైపులా చూసింది. ఓవైపు నుంచి సైకిలు మీద ఓ లావుపాటి మనిషి వస్తూ కనిపించాడు.

జీవరత్నం పనికి తిరిగి అంతరాయం.

అక్కడకు కొంచెం దూరంలోనే వున్న పెద్ద మేడను చూసినప్పుడు జీవరత్నానికి అందులో వుండే మనుషుల గురించి అసూయ కలిగింది. ఆ మేడల్లో వుండే మనుషులకు ఇటువంటి సమస్య లేదు. వాళ్లు హాయిగా వుంటారు. తనలాగా గుడిసెల్లో వుండే మనుషులకే ఈ అసౌకర్యం, ఇబ్బందీనూ –

ఊరి చివరగా రోడ్డు పక్కనే వున్న స్థలాన్ని ఆక్రమించుకుని కొంతమంది రెల్లు గడ్డితో గుడిసెలు వేసుకున్నారు. వాటిని చూస్తే ఓ సినిమా సెట్టింగ్‌లా వుంటుంది. అందులో ఓ గుడిసెను అద్దెకు తీసుకుని వుంటున్నారు జీవరత్నం – భర్త కేయాస్.

రెండు సంవత్సరాల క్రితం జీవరత్నానికి కేయాస్‌తో పెళ్లయింది. పెళ్లయినప్పుడు కేయాస్ టౌన్‌లోనే వుండేవాడు. పెళ్లయిన తర్వాత భార్య కోరిక మీద అద్దె కొంచెం తక్కువని టౌనుకు దగ్గరగా వున్న ఆ పల్లెటూర్లో కాపురం పెట్టాడు. అప్పట్నించీ జీవరత్నం ఈ బహిర్భూమి సమస్యను ఎదుర్కొంటూనే వున్నది.

భయంకరమైన శబ్దం చేసుకుంటూ చిన్నగా వచ్చిన ఓ కార్పొరేషన్ ఎర్రబస్సు సరిగ్గా జీవరత్నం ముందు ఆగింది. అందులోనుంచి ఓ ముసలామె, ముగ్గురు మగాళ్లు దిగారు. కండక్టరు వాళ్లలో ఒకరికి చిల్లర ఇవ్వకపోవడంతో వాదనకు దిగారు.

ఆగిపోయిన ఎర్రబస్సు మీద తెల్లటి అక్షరాలతో ఓ ప్రకటన వుంది...

ఎప్పుడో నేర్చుకున్న అక్షరాలను సులభంగానే గుర్తుపట్టి చదివి నవ్వుకుంది జీవరత్నం.

– అత్యవసర వేళ కూడా ఆమడదూరం వెళ్లవలసిందేనా? – అని రాసి వుంది. పక్కనే జీవరత్నం లాగే చెంబు పట్టుకుని వెళుతున్న ఓ స్త్రీమూర్తి బొమ్మ వుంది.

జీవరత్నం కొన్నాళ్లక్రితం కొన్నాళ్లు తన తల్లి అక్కయ్య ఇంట్లో వున్నది. ఆమె స్కూలు టీచర్. పిల్లలకు ఇంట్లో చదువు చెప్పేది. అప్పుడే జీవరత్నం కూడా చదవటం, రాయటం నేర్చుకున్నది.

అందువల్లనే ఆ ప్రకటనను చదివి కోపం కూడా తెచ్చుకున్నది.

ఎర్రబస్సు వెళ్లిపోయినా ఆ బస్సు మీద చదివిన ప్రకటన తాలూకు ఆలోచనలు జీవరత్నాన్ని చుట్టుకునే వుండిపోయాయి. ఈ వ్యక్తిగత మరుగుదొడ్ల పథకం వల్ల ఉపయోగం ఎవరికి?

తమలాంటి వాళ్లకు ప్రయోజనం లేదు. అప్పటికే ఆ ప్రకటనలో సంప్రదించవలసిన అధికారులుగా రాసిన వాళ్లందరినీ తన భర్త కేయాస్, నాగరత్నం మొగుడు అడివయ్య సంప్రదించి ఆ వ్యక్తిగత మరుగుదొడ్ల పథకాన్ని తమకూ్కడా వర్తింపజేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

కానీ వాళ్లు ఆ పథకం స్వంతంగా సొంత భూమిలో ఇల్లు కట్టుకున్న అల్పాదాయ వర్గాల వాళ్లకే వర్తిస్తుందనీ, ఆక్రమించుకుని ఇళ్లు వేసుకున్న వాళ్లకి వర్తించదనీ చెప్పి వెనక్కి పంపించారు.

ఇక్కడే జీవరత్నానికి అనేక సందేహాలు కలిగాయి.

ఆడవాళ్లందరూ ఒకటి కదా? కేవలం స్వంత ఇళ్లలో వుండే ఆడవాళ్లకే ఈ పథకం ఎందుకు వర్తించాలి? రోడ్డుపక్కన గుడిసెలో వుండే ఆడది అందరి లాంటి ఆడది కాదా? నిజంగా సమస్యను రోజూ తనలాంటి వాళ్లే ఎదుర్కొంటున్నారు కదా... తమలాంటి వాళ్లకు సిగ్గూ, మానాభిమానాలు వుండవా?

ఇదెక్కడి సంక్షేమం? సంక్షేమంలో కూడా తారతమ్యాలు వుంటాయా? ఎన్నికల సమయంలో తమ ఓట్లు కూడా ఓటుకింత డబ్బు, చవకబారు విస్కీ సీసా ఇచ్చి ఓట్లు వేయించుకుంటున్నారు కదా! అలా తమ ఓట్లు ప్రభుత్వాన్ని ఏర్పరచటానికి పనికివచ్చినప్పుడు వ్యక్తిగత మరుగుదొడ్ల పథకానికి తాము అర్హులు కాదా?

ఇదేం న్యాయం? ఇలాంటి పక్షపాతపూరిత ఏకపక్ష న్యాయానికి అంతం లేదా?

ఇలా ఆలోచిస్తూ తను వచ్చిన పని పూర్తికాదని గ్రహించినదై ప్లాస్టిక్ డబ్బాలో నీళ్లను అక్కడే వంచి ఖాళీ డబ్బాతో వచ్చిన పని అవకుండానే బరువెక్కిన హృదయంతో తిరిగి వెళ్లిపోయింది జీవరత్నం. ★